| | | |
|---|---|---|
| | **MARKING SCHEME 2025-2026** | |
| | **CLASS X (089) - TELUGU TELANGANA** | |
| | 10 వ తరగతి - ద్వితీయ భాష - తెలుగు తెలంగాణ<br>ప్రశ్న పత్రము - మూల్యాంకన దర్శిని<br>విభాగం - ఎ (Section - A) - 10 మార్కులు<br>విభాగం - బి (Section - B) - 11 మార్కులు<br>విభాగం - సి (Section - C) - 29 మార్కులు<br>విభాగం - డి (Section - D) - 30 మార్కులు | |
| | సూచనలు | |
| 1. | ఈ ప్రశ్న పత్రం నాలుగు (4) విభాగాలను కలిగి ఉంది. | |
| 2 | ఇందులో 18 ప్రశ్నలున్నాయి. | |
| 3. | విభాగం “ఎ” లో 1 నుండి 1 వరకు మొత్తం 1 ప్రశ్న ఉన్నది. | |
| 4. | విభాగం “బి” లో 2 నుండి 3 వరకు మొత్తం 2 ప్రశ్నలున్నాయి. | |
| 5. | విభాగం “సి” లో 4 నుండి 12 వరకు మొత్తం 9 ప్రశ్నలున్నాయి. | |
| 6. | విభాగం “డి” లో 13 నుండి 18 వరకు మొత్తం 6 ప్రశ్నలున్నాయి. | |
| 7 | ప్రశ్నలకు జవాబులను నిర్దేశిత సూచనలను అనుసరించి రాశారో లేదో గమనించవలెను. | |
| 8 | ప్రశ్న సంఖ్య ఉన్నదీ లేనిదీ తప్పనిసరిగా గమనించి, లేనిచో ప్రశ్న సంఖ్య వేయవలెను. | |
| | సూచనలు | |
| 1 | ఈ ప్రశ్న పత్రంలో ఎ, బి, సి మరియు డి విభాగాల ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. | |
| 2 | ఎ - విభాగంలో ఉన్న 1వ ప్రశ్నలోని 5 బహుళైచ్ఛిక ప్రశ్నలకూ జవాబులను రాయాలి. | |
| 3 | బి -విభాగంలో రెండు, మూడు ప్రశ్నలు ఉన్నాయి. రెండవ ప్రశ్న లేఖా రచన. ఇది తప్పనిసరిగా రాయాలి.<br>మూడవ ప్రశ్న అంతర్గత ఎంపికతో రెండు ప్రశ్నలను కలిగి ఉంది.<br>(దినచర్య- వార్తా నివేదిక)<br>వీటిలో ఒక దానికి మాత్రమే జవాబు రాయాలి. | |

| | | |
|---|---|---|
| 4 | సి - విభాగంలో 4 నుండి 12 వరకు మొత్తం 9 ప్రశ్నలు ఉన్నాయి. (మొత్తం 29 బహుళైచ్ఛిక ప్రశ్నలు) అన్నింటికీ జవాబులు రాయాలి. | |
| 5 | డి- విభాగంలో 13 నుండి 18 వరకు అంతర్గత ఎంపికతో ఆరు ప్రశ్నలు ఉన్నాయి. 6 ప్రశ్నలకు సూచించిన విధంగా జవాబులు రాయాలి. | |
| 6 | అక్షర దోషాలు, భావ దోషాలు, వాక్య నిర్మాణం వంటివి దృష్టిలో ఉంచుకొని మూల్యాంకనం చేయాలి. | |
| 7 | ప్రతి ప్రశ్న వద్ద సూచనలు ఇవ్వబడ్డాయి. వాటిని తప్పక పాటించాలి. | |
| 8 | అక్షర దోషాలకు, వాక్య దోషాలకు, భావ దోషాలకు మార్కులు తీయవలసి ఉంటుంది. | |
| 9 | పైన పేర్కొన్న ఎనిమిదవ సూచన ప్రధానంగా ప్రశ్న- జవాబులు, రచనా ప్రక్రియలలో మాత్రమే పాటించవలెను. | |
| 10 | ప్రతిపదార్థములో అన్వయక్రమం ప్రకారం అన్ని పదాలకు సరైన అర్థాలు రాస్తేనే పూర్తి మార్కులు ఇవ్వాలి.<br>* 6 అక్షర దోషాలకు మించి ఉంటే ½ మా చొప్పున తొలగించవచ్చు. | |
| 11 | సంక్షిప్త సమాధానాల (2 మార్కుల ప్రశ్నలలో) విషయంలో అక్షరదోషాలు ఎక్కువగా ఉంటే 1/2 మార్కుకు మించి తీయరాదు. | |
| 12 | వ్యాసరూప సమాధానాల ( 4 మార్కుల ప్రశ్నలలో ) విషయంలో అక్షరదోషాలు ఎక్కువగా ఉంటే 1 మార్కుకు మించి తీయరాదు.<br>ముఖ్య గమనిక: విద్యార్థులు స్వతంత్ర భావ ప్రకటనతో సరియైన సమాధానాలను అక్షర దోషాలు లేకుండా అర్థవంతంగా రాసినట్లయితే తప్పని సరిగా పూర్తి మార్కులను ఇవ్వవలెను. | |
| 13 | 1 నుండి 12 వరకు గల ప్రశ్నలలో విద్యార్థులు ఆప్షన్ సరిగా రాసి, దానికి సంబంధించిన సమాధానానికి బదులుగా వేరొక సమాధానం రాసినా లేదా సమాధానం సరిగా రాసి, ఆప్షన్ మరొకటి రాసినా సరి అయిన దానిని పరిగణనలోనికి తీసుకొని మార్కు ఇవ్వవలెను.<br>ఉదాహరణకు:<br>1. ప్రామాణిక రచనా భాష ఎందుండి ఏర్పడుతుంది ?<br>ఈ ప్రశ్నకు సరైన సమాధానం (A) మాట్లాడే భాష నుండి<br>విద్యార్థులు 'A' అని రాసి వేరొక సమాధానం రాసినా లేదా మాట్లాడే భాష నుండి అని రాసి B,C,D లలో ఏది రాసినా మార్కులు ఇవ్వవలెను. | |
| 14 | విభాగం' సి 'లో అన్ని ప్రశ్నలకు సమాధానం రాయవలసి ఉంటుంది. ఒక్కొక్క ప్రశ్నకు ఒక్క (1) మార్కు చొప్పున కేటాయించాలి. | |

| | | |
|---|---|---|
| *15* | **ప్రశ్న పత్రంలో చోటు చేసుకున్న అక్షర దోషాలను విద్యార్థులు అదే విధంగా రాసినట్లయితే వాటిని పరిగణన లోనికి తీసుకోకుండా పూర్తి మార్కులు ఇవ్వవలెను.**<br>**గమనిక: విద్యార్థులు స్వతంత్ర భావ ప్రకటనతో అక్షర దోషాలు లేకుండా సమాధానాలను రాసినట్లయితే పూర్తి మార్కులు ఇవ్వవలెను.** | |
| | **విభాగము-'ఎ' ( SECTION- A )** | |
| **1.** | **క్రింది గద్యాంశాన్ని చదివి, కింద ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబులను ఎంచుకొని వ్రాయండి.** | **5×2=10** |
| **( i )** | **ప్రామాణిక రచనా భాష ఎందుండి ఏర్పడుతుంది?**<br>**జవాబు:** (A) మాట్లాడే భాష నుండి | **2 మా** |
| **( ii )** | **మాండలికం అనగా?**<br>**జవాబు:** (C) ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో విధంగా మాట్లాడే భాష | **2 మా** |
| **( iii )** | **తెలంగాణా జిల్లాల్లో వచ్చాడు అనే అర్థంలో ఇలా________ మాట్లాడుతారు.**<br>**జవాబు:** (D) వచ్చిండు | **2 మా** |
| **( iv )** | **ఏ భాషలో ఏకత్వం ఉంటుంది?**<br>**జవాబు:** (B) ప్రామాణిక భాషలో | **2 మా** |
| **( v )** | **అందరూ రాయడానికి ఇష్టపడే భాష ఏది ?**<br>**జవాబు:** (C) ప్రామాణిక భాష | **2 మా** |
| | **విభాగము – 'బి' ( SECTION- B )** | |
| 2 | **క్రింద సూచించిన విధంగా పేరు, చిరునామాలతో విషయాన్ని వివరిస్తూ లేఖ వ్రాయండి.**<br>జనగామ జిల్లా, బమ్మెర గ్రామం ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న కుమారస్వామి ఉపకారవేతనం పొందుటకై ఆజిల్లా విద్యాశాఖాధికారికి విన్నవించిన విషయాన్ని వివరిస్తూ లేఖ రాయండి.<br>**గమనిక: లేఖారచన లోని పదజాలం విద్యార్థుల స్థాయికి మించి ఉన్నందున వారు ఏ విధంగా అర్థం చేసుకుని అర్థవంతంగా రాసినప్పటికీ మార్కులు ఇవ్వవలెను.** | 1 × 6 = 6 |
| | స్థలం, తేది ½ మా<br>సంబోధనా వాక్యం ½ మా<br>విషయం ½ మా<br>విషయ విశ్లేషణ 3 మా<br>ఇట్లు, రాసినవారి పేరు ½ మా<br>చేరవలసిన వారి చిరునామా- 1 మా | |

| | | |
|---|---|---|
| | బమ్మెర,<br>23 - 02 - 2026.<br><br>జిల్లావిద్యాశాఖాధికారి గారికి,<br>ఆర్యా! / అయ్యా !<br>విషయం: పై చదువుల కొరకు ఉపకార వేతనం గురించి...<br>నాపేరు కుమారస్వామి. నేను జనగామ జిల్లా, బమ్మెర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుచున్నాను. నేను ఆర్థికముగా వెనుకబడిన కుటుంబమునకు చెందినవాడను. 9వ తరగతి పరీక్షలలో నాకు 500 మార్కులకు 480 మార్కులు వచ్చాయి. పదవతరగతిలో కూడా బాగా కష్టపడి చదివి, మంచి మార్కులు తెచ్చుకోవడానికి కృషి చేస్తున్నాను.<br>పదవ తరగతి తరువాత పై చదువులు చదువుటకు తగినంత ఆర్థిక స్థోమత లేకపోవుటచే మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పవలసి వస్తుందేమోనని బాధగా ఉన్నది. కాబట్టి తమరు నాయందు దయయుంచి ఉపకార వేతనమును మంజూరు చేయవలసినదిగా ప్రార్థిస్తున్నాను.<br><br>ఇట్లు,<br>తమ విధేయుడు,<br><br>కుమారస్వామి<br><br>చిరునామా :<br>జిల్లా విద్యాశాఖాధికారి,<br>జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం,<br>రాజభవన్ వీధి,<br>జనగామ,<br>జనగామ జిల్లా,<br>తెలంగాణ – XXX XXX. | |
| **3.** | **క్రింది ప్రక్రియలలో ఒక దానికి 100 పదాలలో జవాబు వ్రాయండి.** | 1X5 = 5 |

| | | |
|---|---|---|
| | నీ పేరు శ్రీనిధి. ఒక రోజున పాఠశాలనుండి ఇంటికి వస్తుండగా అతివేగంగా వస్తున్న లారీ<br>అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి, ఆ చెట్టుక్రిందనే గ్రీష్మతాపానికి తట్టుకోలేక సేదతీసుకొంటున్న<br>ఆ బాటసారులను ప్రమాదానికి గురిచేసింది ఈ విషాద సంఘటనను చూసి నీవు కలతచెందావు. ఈ విషయాన్ని గురించి నీ మదిలో కలిగిన భావాలను దినచర్య రూపంలో రాయండి.<br>**గమనిక: పై ప్రశ్నలో గ్రీష్మతాపానికి అనే పదాన్ని విద్యార్థులు ఏవిధంగా అర్థం చేసుకుని విషయాన్ని వ్యక్తీకరించినప్పటికి తగిన విధంగా స్పందించి మార్కులు ఇవ్వవలెను.** | |
| ( i ) | **దినచర్య**<br>తేదీ, వారం 1 మా<br>సమయము ½ మా<br>విషయం 3½ మా | |
| | తేది: 23.02.2026<br>వారం : సోమవారం<br>సమయం : రాత్రి 9 గంటలు<br><br>ఈరోజు నా మనసుకు ఏదో తెలియని దిగులుగా ఉంది. సాయంత్రం పాఠశాల నుండి ఇంటికి వస్తుండగా దారిలో ఒక విషాదకర దృశ్యాన్ని చూసాను. అతివేగంగా దూసుకు వస్తున్న లారీ ఒక చెట్టును ఢీకొట్టింది. ఎండ తాపాన్ని తట్టుకోలేక ఆచెట్టు కిందనే విశ్రాంతి తీసుకుంటున్న బాటసారులలో కొందరు ఆ ప్రమాదానికి గురయ్యారు. ఏం జరిగిందో తెలియనంత అయోమయ పరిస్థితి. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అది చూసిన నామనస్సు కకావికలమయినది. నేను వెంటనే అక్కడకు వెళ్లి నా వాటర్ బాటిల్ లోని నీళ్ళు తీసుకొని వారి ముఖాలపై చల్లాను. కొంచెం కళ్ళు తెరిచారు. వెంటనే పక్కనే వున్న ఒకాయనతో 108కి ఫోన్ చేయించాను. పది నిముషాల్లో అంబులెన్స్ వచ్చింది. చుట్టూచేరిన వారంతా తలా ఓ చెయ్యివేసి బాధితులను అంబులెన్సుఎక్కించారు. ఇదంతా రెండు గంటలలో జరిగిపోయింది. నేను | |

| | | |
|---|---|---|
| | వెంటనే సమయానికి స్పందించినందుకు అందరూ మంచిపని చేసానన్నారు. ఈ విషయాన్ని గురించి ఆలోచిస్తూనే నిద్రకుపక్రమించాను.<br>శ్రీనిధి. | |
| | **లేదా** | |
| ( ii ) | **వార్తానివేదిక**<br>నీ పేరు త్రిమూర్తి. నీవు వరంగల్ లో జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నావు. సెప్టెంబర్ 5న మీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని నవతెలంగాణ దినపత్రికకు వార్తా నివేదికను తయారు చేయండి.<br>**ఆధార పదాలు:**<br>డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ - జయంతి - ముఖ్య అతిధి - జిల్లావిద్యాశాఖాధికారి - ఉత్తమ<br>ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం - తల్లిదండ్రులు - ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు.<br>**సూచన:** ఇచ్చిన ఆధార పదాలను వార్తా నివేదిక రాసేటప్పుడు తప్పక ఉపయోగించాలి . | |
| | **వార్తా నివేదిక**<br>శీర్షిక రాసినందుకు 1/2 మా<br>ఊరిపేరు, తేదీ రాసినందుకు 1/2మా<br>విషయ వ్యక్తీకరణకు 4 మా<br><br>**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.**<br><br>వరంగల్, సెప్టెంబర్ 5 - డా\|\| సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని పురస్కరించుకొని వరంగల్ లోని, జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. పాఠశాలలోని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు.<br>అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ; ఎన్ని వృత్తులున్నా వారందరినీ తయారుచేసేది ఉపాధ్యాయులే అనీ, వివేకం, విచక్షణ, వితరణ ఈ మూడింటినీ | |

| | | |
|---|---|---|
| | అందించగలిగే గురువుని సాక్షాత్తూ దేవుడితో సమానంగా **సమాజం** పూజిస్తుంది అన్నారు. "నేటి బాలలే రేపటి పౌరులు" కనుక విద్యార్థులంతా క్రమశిక్షణను అలవర్చుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథిని సత్కరించారు. చివరిగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంతగానో ప్రశంసించారు. | |
| | విభాగం –'సి' ( SECTION- C ) | |
| 4. | *సంధులకు చెందిన క్రింది ప్రశ్నలకు సరైన సమాధానాలను గుర్తించి వ్రాయండి.* | 4X1=4 |
| ( i ) | **పడ్వాదులు అనగా...**<br>జవాబు: (A) పడు, పెట్టు, పాటు మొదలైన పదాలు | 1 మా |
| ( ii ) | **కర్మధారయమునం దత్సమంబులకాలు శబ్దము పరంబగునపుడత్వంబున కుత్వంబును రుగామంబునగు - ఈ సూత్రమునకు ఉదాహరణము?**<br>జవాబు: (C) సత్య వచనురాలు | 1 మా |
| ( iii ) | **ద్విరుక్తటకార సంధికి ఉదాహరణ...**<br>జవాబు: (B) కట్టెదురు | 1 మా |
| ( iv ) | **అయ్యవసరము - ఏ సంధి ఉదాహరణకు చెందినది?**<br>జవాబు: (C) త్రికసంధి | 1 మా |
| 5. | **ఛందస్సుకు సంబంధించిన క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించి వ్రాయండి.**<br><br>**విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్రగా** | 4x1=4 |
| ( i ) | **పై పద్యపాదంలో గల గణాలు ఏవి?**<br>జవాబు: (B) స భ ర నమ య వ | 1 మా |
| ( ii ) | **పై పద్య పాదం ఏ ఛందస్సుకు చెందినది?**<br>జవాబు: (D) మత్తేభం | 1 మా |
| ( iii ) | **శార్దూల వృత్తపద్యంలో యతిమైత్రి ఏయే అక్షరాలకు చెల్లుతుంది?**<br>జవాబు: (C) 1 - 13 | 1 మా |
| ( iv ) | **యతి అనగా?**<br>జవాబు: (B) పద్యపాదంలో మొదటి అక్షరం | 1 మా |
| **6.** | **ఈ క్రింది సమాసాలకు చెందిన ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించి వ్రాయండి.** | **4 x 1=4** |
| ( i ) | **అన్యపదార్థ ప్రాధాన్యం గల సమాసం ఏ సమాసం?**<br>జవాబు: (B) బహువ్రీహి సమాసం | 1 మా |

| | | |
|---|---|---|
| ( ii ) | **షట్చక్రవర్తులు - ఏ సమాసం?**<br>జవాబు: (A) ద్విగు సమాసం | 1 మా |
| ( iii ) | **ఆశాపాశం......దీనికి విగ్రహ వాక్యం గుర్తించండి.**<br>జవాబు:<br>**గమనిక: ఆశాపాశం అనే పదానికి విగ్రహవాక్యం ఆశ అనెడి పాశం అని సమాధానాలలో లేనందువల్ల విద్యార్థి A, B, C, D లలో ఏ సమాధానం రాసినా మార్కు ఇవ్వవలెను.** | 1 మా |
| ( iv ) | **ద్వంద్వ సమాస లక్షణం?**<br>జవాబు: (C) ఉభయ పదార్థ ప్రాధాన్యం గలది | 1 మా |
| **7.** | **ఈ క్రింది అలంకార ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించి వ్రాయండి.** | **4x1=4** |
| ( i ) | **క్రమాలంకారానికి మరొక పేరు?**<br>జవాబు: (A) యధా సంఖ్యాలంకారం | 1 మా |
| ( ii ) | **అతిశయోక్తి అలంకారానికి ఉదాహరణ?**<br>జవాబు: (C) ఇంద్రప్రస్థ పురమునందలి బేహారులు కుబేరునకైనను ధన సహాయం చేయగలరు. | 1 మా |
| ( iii ) | **"ప్రవరుడు హిమాలయాలలో తిరుగుతూ తన పాద లేపనం కరిగి పోవడం గుర్తించలేదు."**<br>***దైవ కృతము నకు అసాధ్యం లేదు కదా ! ఇందులోగల అలంకారం ?***<br>జవాబు: (D) అర్థాంతరన్యాసాలంకారం | 1 మా |
| ( iv ) | **అతని మనస్సు వజ్రంలా దృఢంగా ఉంది - ఈ వాక్యంలో ఉపమానాన్ని గుర్తించండి.**<br>జవాబు: (C) వజ్రం | 1 మా |
| **8.** | **ఈ క్రింది వానికి పర్యాయపదాలు గుర్తించి జవాబు పత్రంలో వ్రాయండి.** | **2x 1=2** |
| ( i ) | **జలజం...**<br>**జవాబు:**<br>**గమనిక : పాఠ్యపుస్తకంలో CBSE తెలుగు (2L) లో "జలజం" అనే పదానికి వారిజము అనే పర్యాయపదం లేనందువల్ల A,B,C,D లలో ఏ సమాధానం రాసినా మార్కు ఇవ్వవలెను.** | 1 మా |
| ( ii ) | **కృపాణం....**<br>జవాబు: (B) కత్తి, ఖడ్గం | 1 మా |

| | | |
|---|---|---|
| 9. | **ఈ క్రింది జాతీయాలకు సరైన సమాధానాలను గుర్తించి జవాబు పత్రంలో వ్రాయండి.** | 2x 1=2 |
| ( i ) | **స్పష్టంగా తెలియజేయు అనే అర్థంలో ఈ జాతీయాన్ని ప్రయోగిస్తారు.**<br>జవాబు: (B) కళ్ళకు కట్టినట్లు | 1 మా |
| ( ii ) | **పెడచెవిని పెట్టు - ఈ జాతీయాన్ని ఏ అర్థంలో ప్రయోగిస్తారు.**<br>జవాబు: (C) వినక పోవుట | 1 మా |
| 10. | **ఈ క్రింది సామెతలకు సమాధానాలు గుర్తించి జవాబు పత్రంలో వ్రాయండి.** | 2x 1=2 |
| ( i ) | **"గోరు చుట్టు మీద రోకటి పోటు" - ఈ సామెతకు అర్థం?**<br>**గమనిక: ఇచ్చిన సామెత నిర్దేశించిన సిలబస్ లో లేనందున విద్యార్థులు A, B, C, D లలో ఏ సమాధానం రాసినా మార్కు ఇవ్వవలెను.** | 1 మా |
| ( ii ) | **"ఎవ్వరికీ తెలియదనుకొని కొందరు రహస్యాలు మాట్లాడుకునే సందర్భంలో వాడే సామెత?**<br>జవాబు: (B) అతి రహస్యం బట్టబయలు | 1 మా |
| 11. | **ఈ క్రింది ప్రక్రియలను గుర్తించి జవాబు పత్రంలో వ్రాయండి.** | 2x1=2 |
| ( i ) | **గోలకొండ - పాఠం ఏ ప్రక్రియకు చెందినది.**<br>జవాబు: (D) చారిత్రక వ్యాసం | 1 మా |
| ( ii ) | **జీవనభాష్యం - పాఠ్యాంశం ఏ ప్రక్రియకు చెందినది?**<br>జవాబు: (B) గజల్ | 1 మా |
| 12 (A) | **ఈ క్రింది పరిచిత గద్యాంశాన్ని చదివి, అడిగిన ప్రశ్నలకు సరైన జవాబు ఎంచుకుని వ్రాయండి.** | 5x1=5 |
| ( i ) | **గోలకొండ ప్రాధాన్యం ఎలా తగ్గింది?**<br>జవాబు: (A) హైదరాబాదు నగరము నిర్మాణము క్రమాభివృద్ధి చెందుట వలన | 1 మా |
| ( ii ) | **గోలకొండ పట్టణములో రమారమి ఎన్ని యిండ్లు ఉన్నాయి?**<br>జవాబు: (B) నలుబదివేల యిండ్లు | 1 మా |
| ( iii ) | **ఎవరు ప్రజల సౌకర్యార్థము 78 లక్షల హోనులు వెచ్చించాడు?**<br>జవాబు: (B) మహమ్మద్ కులీ కుతుబుషా | 1 మా |
| ( iv ) | **దుర్గంలో ఎత్తు ప్రదేశాన నిర్మించిన తటాకము?**<br>జవాబు: (D) దుర్గ తటాకము | 1 మా |
| (v ) | **దేని నుండి నీరు మట్టి గొట్టముల ద్వారా పట్టణంలోని పలు ప్రాంతాలకు సప్లయి అవుతోంది?**<br>జవాబు: (A) కటోరా హవుజు | 1 మా |
| 12.(B) | (లేదా) | |

| | | |
|---|---|---|
| | **ఈ క్రింది పద్యం చదివి, ప్రశ్నలకు సరియైన సమాధానాలను గుర్తించి వ్రాయండి.** | |
| ( i ) | **"వచ్చినవాడు శివుడు, విష్ణువు, బ్రహ్మ ఎవరైనా సరే" అనే భావం వచ్చే పద్యపాదం ఏది?**<br>జవాబు: (A) హరుడైననన్, హరియైన, నీరజభవుండభ్యాగతుండైననౌ | 1 మా |
| ( ii ) | **"నాకు నరకం సంభవించినా సరే, బంధింపబడినా సరే" – అని అన్న దెవరు?**<br>జవాబు: (B) బలిచక్రవర్తి | 1 మా |
| ( iii ) | **నీరజభవుడు - అంటే ఎవరు?**<br>జవాబు: (B) బ్రహ్మ | 1 మా |
| ( iv ) | **హరి - ఈ పదానికి నానార్థాలు**<br>జవాబు:<br>**గమనిక : సిలబస్ లో నానార్థాలు లేనందువల్ల విద్యార్థులు A, B, C, D లలో ఏ సమాధానం రాసినా మార్కు ఇవ్వవలెను.** | 1 మా |
| ( v ) | **"తిరుగన్ నేరదు నా జిహ్వ" అంటే**<br>జవాబు : **(A) నా నాలుక వెనుదిరుగదు (లేదా) (D) నేను ఆడిన మాట తప్పను. రెండూ సరైన సమాధానాలే కనుక రెండింటిలో ఏ సమాధానం రాసినా మార్కు ఇవ్వవలెను.** | 1 మా |
| | విభాగము-'డి' ( SECTION- D ) | |
| 13 | **కింది ప్రశ్నలలో ఏవేని రెండింటికి (2) సంగ్రహంగా సమాధానాలు వ్రాయండి.**<br>**సూచన: విద్యార్థులు ముఖ్యమైన వాక్యాలు రెండు రాసినట్లయితే పూర్తి మార్కులు ఇవ్వవచ్చు.**<br>విషయ వివరణకు 1 మా<br>రచనా శైలికి ½ మా<br>భాషానైపుణ్యమునకు ½ మా | 2x2=4 |
| (i) | **(i) 'జీవన భాష్యం' పాఠ్యభాగ కవిని గురించి రాయండి.** | 2 మా |
| జవాబు | కవి పరిచయము<br>పాఠం పేరు: 'జీవన భాష్యం'<br>కవిపేరు: ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు (సినారె)<br>జననం: రాజన్నసిరిసిల్ల జిల్లా హనుమాజీపేట గ్రామంలో 1931లో జన్మించారు.<br>ప్రతిభ: వీరు ప్రముఖ ఆధునిక కవి. మంచి వక్త, సాహితీ పరిశోధకుడు. బహుభాషావేత్త. ప్రసిద్ధ సినీ గేయ రచయిత.<br>రచనలు: 1) నాగార్జున సాగరం 2) కర్పూర వసంతరాయలు 3) | |

| | | |
|---|---|---|
| | మధ్యతరగతి మందహాసం 4) ద్విపదులు 5) విశ్వంభర 6) ప్రపంచపదులు<br>జ్ఞానపీఠ అవార్డు: 'విశ్వంభర' కావ్యానికి జాతీయస్థాయిలో అత్యున్నత సాహితీ పురస్కారం, 'జ్ఞానపీఠ' అవార్డు లభించింది.<br>బిరుదు: భారత ప్రభుత్వం వీరిని పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది. | |
| (ii) | **నరరూప రాక్షసులు ఎవరు?** | 2 మా |
| జవాబు | ➢ కలలో కూడా సత్యాన్ని పలకడానికి ఇష్టపడనివాడు.<br>➢ మాయమాటలు చెప్పి ఇతరుల సొమ్మును అపహరించేవాడు.<br>➢ కులగర్వంతో బీదల ఇళ్ళను నాశనం చేసేవాడు.<br>➢ లంచాల విలువను పెంచేవాడు.<br>➢ వావివరుసలను పాటించనివాడు.<br>➢ నవ్వుతూ ముచ్చట్లు చెపుతూ ఎదుటివాడిని నాశనం చేసేవాడు.<br>➢ తల్లిదండ్రులను ఇంటి నుండి వెళ్ళగొట్టేవాడు.<br>ఇటువంటి వారిని నరరూప రాక్షసులు అంటారు. | |
| (iii) | **ఈ కుబ్జుండలతింటోడు - అని ఎవరు ఎవరితో ఏ సందర్భంలో అన్నారు? దీని అర్థమేమి?** | 2 మా |
| జవాబు | బలిచక్రవర్తి వామనునికి మూడడుగుల నేల దానం ఇస్తానన్న విషయం తెలిసిన సందర్భంలో 'ఈ కుబ్జుండలతింటోడు' అని శుక్రాచార్యుడు బలిచక్రవర్తితో అన్నాడు. వచ్చిన పొట్టివాడైన వామనుడు తాను అడిగిన కొద్దిపాటి మూడు అడుగుల నేలతో పోడనీ, అతడు ఆ మూడడుగుల పేరుతో, మూడు లోకాలనూ కొలుస్తాడనీ, బ్రహ్మాండం అంతా నిండిపోతాడనీ, బలి చక్రవర్తి రాజ్యాన్ని మొత్తం స్వాధీనం చేసుకొంటాడనీ దీని అర్థం. | |
| (iv) | **కాశీ నగరములోని బ్రాహ్మణ వనితలు భిక్షువులకు భిక్షను ఏ విధంగా పెట్టేవారు?** | 2 మా |
| జవాబు | కాశీ నగరములోని బ్రాహ్మణ వనితలు వాకిట్లో ఆవు పేడతో చక్కగా అలికి, నాలుగు అంచులూ కలిసే విధంగా దానిపై ముగ్గు పెట్టి, ఆ ముగ్గు మధ్యలో వచ్చిన అతిథిని నిలబెట్టి, వారికి కాళ్ళూ చేతులూ కడుగుకోడానికి నీళ్ళు ఇచ్చి, (అర్ఘ్య పాద్యములు ఇచ్చి) వారిని పూవులతో, గంధముతో పూజచేసి, కడిగిన బంగారు గరిటెతో అన్నం పై ఆవునేతిని చల్లి, పండ్లతో, పరమాన్నముతో, పలు | |

| | | |
|---|---|---|
| | రకాల పిండివంటలతో భక్తి విశ్వాసాలు ఉట్టిపడే రీతిగా భిక్షువులకు భిక్షను పెట్టేవారు. | |
| 14 | **క్రింది ప్రశ్నలలో ఏవేని రెండింటికి (2) సంగ్రహంగా సమాధానాలు వ్రాయండి.**<br>**గమనిక: 3, 4 ప్రశ్నలు సిలబస్ లో లేనందు వలన (లక్ష్యసిద్ధి పాఠం నుండి వచ్చినవి)**<br>**విద్యార్థులకు ఇక్కడ 4 మార్కులను తప్పనిసరిగా ఇవ్వవలెను.)** | 2X2=4 |
| ( i ) | **చెరువుల ప్రాముఖ్యత ఏమిటి?** | 2 మా |
| జవాబు | చెరువుల వల్ల మనకు ఎన్నో ఉపయోగాలున్నాయి.<br>➢ చెరువు నీరు పంటపొలాలకు నీటి వసతి కల్పిస్తుంది.<br>➢ చెరువులో ఉండే చేపలు ఎందరికో జీవనోపాధిని కలిగిస్తున్నాయి.<br>➢ చెరువు నీరు పశువులకు దాహార్తిని తీరుస్తుంది. ప్రజలకు త్రాగునీటిని అందిస్తుంది.<br>➢ గ్రామంలో చెరువుల్లో నీరు ఉంటే, భూగర్భ జలాలు ఎండిపోవు.<br>➢ చెరువులు ఎండినప్పుడు ఆ మట్టి పంట పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతుంది.<br>➢ చెరువులలో నీరు నిండుగా ఉంటే, ఆ గ్రామాల్లో ప్రకృతి పచ్చగా కళకళలాడుతుంటుంది. | |
| ( ii ) | **"ఎవరిభాష వారికి వినసొంపు" - పాఠ్యభాగ రచయితను గురించి రాయండి.** | 2 మా |
| జవాబు | "ఎవరిభాష వారికి వినసొంపు" - పాఠ్యభాగ రచయిత డా\|\| సామల సదాశివగారు.<br>జననం: 11-05-1928<br>మరణం: 07-08-2012.<br>జన్మస్థలం: కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భాగమైన దహెగామ్ మండలంలోని తెనుగుపల్లె.<br>నేర్చిన భాషలు: సంస్కృతం, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, పార్సీ, మరాఠీ.<br>రచనాశైలి: ఈయన రచనలోని భాష సహజ సుందరంగా, సరళంగా ఉంటుంది.<br>రచనలు: ఉర్దూ సాహిత్య చరిత్ర, అమ్జద్ రుబాయీలు, మలయమారుతాలు, యాది, సంగీత శిఖరాలు మొదలయినవి.<br>పురస్కారాలు: 'అమ్జద్ రుబాయీలు అనువాదానికి 1964 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ అనువాద రచనా పురస్కారం లభించింది.<br>'స్వరలయలు' గ్రంథానికి 2011 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. | |

| | | |
|---|---|---|
| | కాకతీయ విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. | |
| ( iii ) | **తెలంగాణ జాతి చరిత్రలో తెలంగాణ జాతి చరిత్రలో అద్భుతమైన క్షణమేది? ఎందుకు?** | 2 మా |
| ( iv ) | **పత్రికలలో సంపాదకీయాలు ఎందుకు రాస్తారు?** | 2 మా |
| 15 | **కింది ప్రశ్నలలో ఏదేని ఒకదానికి (1) విపులంగా సమాధానం వ్రాయండి.**<br>**సూచన: నాలుగు ముఖ్యమైన వాక్యాలు రాసినట్లయితే పూర్తి మార్కులు ఇవ్వవచ్చు.**<br>విషయ వివరణ 3 మా<br>రచనా శైలి ½ మా<br>భాషానైపుణ్యము ½ మా | 1X4 = 4 |
| ( i ) | **'జీవన భాష్యం' - పాఠ్య భాగం అందించే సందేశమేమి?**<br>సూచన: నాలుగు ముఖ్యమైన అంశాలు రాసినట్లయితే పూర్తి మార్కులు ఇవ్వవచ్చు | |
| జవాబు | మనస్సులో బాధలు, విచారాలు, చింతలు, మనిషిని బాధిస్తూ ఉంటాయి. ఆ బాధలు మబ్బు వంటివి. మనసుకు మబ్బు ముసరడం అంటే, ఆ బాధలు, చింతలు మనస్సుని విచారంతో కప్పేయడం అని సినారె అన్నారు.<br>ఒక పనిని ప్రారంభించడానికి ముందు, ఆ పని చేయడంలో ఎన్నో చిక్కులు, ఆటంకాలు ఎదరవుతాయని మిత్రులు బెదరిస్తూ ఉంటారు. అయితే దానికి జంకకుండా, ముందడుగు వేయాలి. అలా ధైర్యంగా ముందడుగు వేస్తే, అదే మార్గం అందరికీ దారి చూపుతుందని అని సినారె అన్నారు..<br>ఇసుక దిబ్బలను దున్నినా ప్రయోజనం ఉండదని సామాన్య జనం అనుకుంటారు. ఏ ప్రయత్నం చేయకుండానే బీడు నేలల్లో ఏ పంటలూ పండవని నిరాశలో ఉండవద్దని, కష్టపడి 'ఆ నేలను దున్ని విశ్వాసంతో విత్తనాలు నాటితే, మంచి పంటలు పండుతాయని సందేశం యిస్తూ' కవి ఇలా అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు నిరాశ చెందవద్దనీ ప్రయత్నిస్తే వారు కూడా రాణిస్తారనీ, ప్రయత్నం గట్టిగా సాగాలనీ, ఆశావహదృష్టితో ముందుకు పోవాలనీ విద్యార్థులకు సినారె దీని ద్వారా సందేశం ఇచ్చారు.<br>నలుగురు మనుష్యులూ కలసి ఒకరికొకరు సహకరించుకుంటూ జీవించడం మంచి సాంఘిక జీవనం అని, సాటి మనుష్యుల పట్ల మనం సానుకూల | |

| | | |
|---|---|---|
| | దృక్పథాన్ని ఏర్పరచుకోవాలని, అటువంటి మనుష్యులు అందరూ కలిస్తేనే, ఒక ఊరు ఏర్పడుతుందని వారు సందేశం ఇచ్చారు.<br>ఎంత సామర్థ్యం మనకు ఉన్నా, అధికారం, సంపదలు ఉన్నా, మనం ఎన్నో విజయాలు సాధించినా, ఇంక మనకు ఏ కష్టాలూ, బాధలూ రావని ధీమాగా ఉండరాదని కవి సందేశం ఇచ్చారు. విధి ఎప్పుడు ఏ కష్టాలు కలిగిస్తుందో, సమస్యలను తీసుకువస్తుందో, పరీక్షలు పెడుతుందో ఎవరూ ఊహించలేరని కవి సూచించారు. విధి శక్తి ముందు ఎవరైనా తలవంచవలసిందే అని కవి తెలియజెప్పారు. ఉన్నతమైన హిమాలయపర్వత శిఖరం కూడా ఎండవేడికి కరిగిపోయి, నదిగా ప్రవహించవలసి వస్తోంది. అలాగే ఎంతటి మనిషి అయినా, విధి పరీక్షిస్తే అతని గర్వం కరిగి నీరు కావలసిందే అని కవి తెలిపారు. | |
| (ii) | **బలిచక్రవర్తి "ఆడిన మాట తప్పడు" ఈవిషయాన్ని వివరించండి.** | |
| **జవాబు** | పూర్వం భూదేవి ఎటువంటి చెడ్డపని చేసినవాడినైనా భరిస్తాను కాని, అడినమాట తప్పినవాడిని మాత్రం మోయలేను అని చెప్పిందట. తాను అన్నమాటకు కట్టుబడి సత్యంతో బ్రతకడం, అభిమానధనులైన వారికి ఉత్తమ మార్గం.<br>ఎన్ని కష్టాలు వచ్చినా, పేదరికం సంభవించినా, ధన ప్రాణాలకు చేటు వచ్చినా, చివరికి మరణమే సంభవించినా అభిమానధనులు మాట తప్పలేరు. అందుచేతనే వామనుడికి మూడు అడుగుల నేలను దానం ఇస్తానన్న తన మాటకు కట్టుబడి దానం చేశాడు. దానం ఇస్తే రాజ్యం పోతుందనీ, దరిద్రము వస్తుందనీ, బంధనం ప్రాప్తిస్తుందనీ గురువుగారు చెప్పినా, వినకుండా అభిమానధనుడైన బలిచక్రవర్తి తాను ఇచ్చిన మాటకు కట్టుబడి, మూడు అడుగుల నేలను వామనునికి దానం చేశాడు. అందువల్ల 'బలిచక్రవర్తి ఆడిన మాట తప్పనివాడు' అని చెప్పవచ్చు. | |
| 16 | **కింది ప్రశ్నలలో ఏదేని ఒకదానికి (1) విపులంగా సమాధానం వ్రాయండి.**<br>**సూచన: నాలుగు ముఖ్యమైన వాక్యాలు రాసినట్లయితే పూర్తి మార్కులు ఇవ్వవచ్చు.**<br>విషయ వివరణ 3 మా<br>రచనా శైలి ½ మా<br>భాషానైపుణ్యము ½ మా | 1X4 = 4 |
| ( i ) | **కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు వారీ రామచంద్రా. ఇగపటు అనడం సదాశివ గారికి ఎందుకు వింతగా అనిపించిందో వివరించండి.** | |

| | | |
|---|---|---|
| | తిరుమల రామచంద్ర గారు ప్రాకృత, సంస్కృత, ఆంధ్రభాషల్లో పండితులు. వారు కొంతకాలం ఆంధ్రప్రభ వారపత్రికలో చివరి పేజీ రాసేవారు. దాని పేరు హైదరాబాద్ నోట్ బుక్. ఏ పత్రికకయినా చివరి పేజీయే అందం.<br>ఒక వారం రామచంద్ర గారు హైదరాబాద్ నోట్ బుక్ లో తన బాల్య మిత్రులైన కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారి గురించి ఇలా రాశారు. లక్ష్మణ శాస్త్రి గారు తిరుపతి నుండి తెచ్చిన లడ్డూను రామచంద్ర గారికి ఇస్తూ, "వారీ రామచంద్రా! ఇగ పటు తిరుపతి లడ్డూ అన్నారట" వారి ప్రాంతీయ భాషలో.<br>అంత పసందైన ప్రాంతీయ భాషలో మాట్లాడిన కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారు నిజానికి సంస్కృతాంధ్ర భాషల్లో, కావ్య వ్యాకరణ శాస్త్రాల్లో ఉద్దండ పండితులు. సంస్కృతంలో బిల్హణ మహాకవి రాసిన విక్రమాంకదేవ చరిత్రమనే ప్రౌఢ కావ్యాన్ని తెలుగులో ఇంకా ప్రౌఢంగా అనువదించినారు, బిల్హణ మహాకవిదే అయిన కర్ణ సుందరి అనే నాటకాన్ని అనువదించి ప్రచురించుకున్నారు. అంతటివారు వారీ రామచంద్రా! అని సంబోధించడం 'ఇగపటు' అనటం సదాశివ గారికి వింతగా అనిపించింది. | |
| ( ii ) | **కొత్తబాట పాఠ్యభాగం ఆధారంగా పల్లెల్లో వచ్చిన మార్పులను తెలియజేయండి.** | |
| | 1) పూర్వం పల్లెల్లో భూస్వాములు సన్న, చిన్న కారు రైతులపై పెత్తనం చెలాయిస్తూ ఉండేవారు. గ్రామాల్లో పెద్ద ఇళ్ళ ఆడవాళ్ళు, సామాన్యుల కంటపడకుండా వారి బండ్లకు తెరలు కట్టే ఆచారం ఉండేది. అది నేడు అంతరించింది.<br>2) రచ్చబండపై గ్రామపెద్దతో పాటు, నేడు గ్రామస్థులు అందరూ కలిసిమెలిసి కూర్చుంటున్నారు.<br>3) గ్రామపెద్ద రంగరాయని వంటి వారి పెత్తనాన్ని గ్రామాల్లో ప్రజలు నేడు ధిక్కరించారు. రంగరాయడు వంటివారు గ్రామాలు విడిచివెళ్ళారు.<br>4) పోలీసు పటేళ్ళ పెత్తనం గ్రామాల్లో తగ్గిపోయింది. పటేళ్ళకు లంచాలిచ్చే గ్రామ ప్రజలు నేడు లేరు. అందువల్ల పోలీసు పటేళ్ళకు సాగుబాటు లేకుండాపోయింది.<br>5) ప్రజలు గ్రామపెద్దల చెప్పుల కింద తేళ్ళలా అణిగి యుండడం మానివేశారు. ప్రజలు చీటికీ మాటికీ తగవులూ, కొట్లాటలూ మానారు. పంచాయితీలు, జరిమానాలు, గ్రామాల్లో ఇప్పుడు లేవు. ఇప్పుడు ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే | |

| | | |
|---|---|---|
| | తీర్పులు ఇస్తున్నారు. రాత్రి దొంగతనాలు లేవు. ప్రజలకు శిక్షలు లేవు. ప్రజలు అడుక్కు తినడం లేదు.<br>6) పెద్దల పెళ్ళిళ్ళకు సహితం ఇప్పుడు మేనాలూ, పల్లకీలూ ప్రజలు మోయడం లేదు. గ్రామాల్లో ఇండ్లలో పనిమనుషులను సైతం తమ తోటివారిగా ప్రజలు చూస్తున్నారు. ఈ విధంగా తెలంగాణ పల్లెలలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. | |
| 17 | **క్రింది పద్యాలలో ఏదేని ఒకదానికి (1) అన్వయక్రమంతో ప్రతిపదార్థం వ్రాయండి.**<br>అన్వయక్రమము 1 మా<br>సంధి పరిచ్ఛేదము 1 మా<br>ప్రతిపదార్థము 4 మా | 1X6=6 |
| (i) | ప్రతిపదార్థం | |
| | ఆకంఠంబుగ నిప్డు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁగా<br>లేకున్నం గడు నంగలార్చెదవు మేలే ? లెస్స ! శాంతుండవే !<br>నీకంటెన్ మతిహీనులే కటకటా ! నీవార ముష్టింపచుల్<br>శాకాహారులుఁ గందభోజులు, శిలోంఛ ప్రక్రముల్ తాపసుల్! | |
| జవాబు | ఇప్డు = ఇప్పుడు<br>ఆకంఠంబుగన్ = కంఠము దాకా (గొంతు దాకా)<br>మాధుకర భిక్షాన్నంబు = మాధుకర రూపమైన భిక్షాన్నమును<br>భక్షింపగాన్ = తినడానికి<br>లేకున్నన్ (లేక + ఉన్నన్) = లేకపోయేసరికి<br>కడున్ = మిక్కిలి<br>అంగలార్చెదవు = అంగలు వేస్తున్నావు (తొట్రుపడుతున్నావు)<br>మేలే? (మేలు + ఏ) = నీవు చేసే పని మంచిదా?<br>లెస్స = బాగున్నదా?<br>శాంతుండవే (శాంతుండవు+ఏ) = నీవు శాంత గుణం కలవాడవేనా !<br>కటకటా = అయ్యో! (అక్కటా!)<br>నీవార ముష్టింపచుల్ = ఏ పూటకు ఆ పూట పిడికెడు నివ్వరి | |

| | | |
|---|---|---|
| | వడ్లు దంచుకొని వండి తినేవారునూ<br>శాక + ఆహారులు = కాయ కూరలు మాత్రమే తినేవారునూ<br>కందభోజులు = దుంపలు మాత్రమే తినేవారునూ<br>శిల = కోతకోసిన వరిమళ్ళలో జారిపడిన కంకులు ఏరుకొని వాటితో బ్రతికేవారునూ<br>ఉంఛ ప్రక్రముల్ = రచ్చరోళ్ళ వద్ద వడ్లు దంచేటప్పుడు చుట్టూ జారిపడిన బియ్యపు గింజలు ఏరుకొనడమే జీవనంగా కలవారునూ అయిన<br>తాపసుల్ = తపస్సు చేసుకొనేవారు; (మునులు)<br>నీకంటెన్ = నీ కన్నా<br>మతిహీనులు + ఏ = బుద్ధితక్కువ వారా? (తెలివి తక్కువ వారా?) | |
| ( ii ) | సిరి లేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్<br>గురుపాదానతి కేలనీగి చెవులందున్విన్కి వక్త్రంబునన్<br>స్థిర సత్యోక్తి భుజంబులన్విజయమున్ చిత్తంబునన్ సన్మనో<br>హర సౌజన్యము గల్గినన్ సురభిమల్లా ! నీతివాచస్పతీ ! | |
| | సురభిమల్లా! = ఓ "సురభిమల్ల" భూపాలుడా!<br>నీతివాచస్పతీ = నీతి శాస్త్రమునందు దేవతల గురువైన బృహస్పతి వంటి గొప్పవాడా!<br>ఔదలన్ = శిరస్సు నందు<br>గురుపాద = శ్రీ గురువు గారి పాదాలకు<br>ఆనతి = మ్రొక్కుటయూ (నమస్కరించడమూ)<br>కేలన్ = చేతియందు<br>ఈగి = దానగుణమునూ<br>చెవులందున్ = చెవులయందు<br>విన్కి = శాస్త్రములు వినుటయూ<br>వక్త్రంబునన్ = ముఖమునందు<br>స్థిర = స్థిరమైన<br>సత్య + ఉక్తి = సత్యమైన వాక్కునూ<br>భుజంబులన్ = భుజములందు<br>విజయమున్ = విజయమునూ<br>చిత్తంబునన్ = మనస్సునందు | |

| | | |
|---|---|---|
| | సత్ = చక్కని<br>మనోహర = ఇంపైన<br>సౌజన్యము = మంచితనమునూ<br>కల్గినన్ = కల్గి ఉన్నట్లయితే<br>బుధుండు = పండితుడు<br>సిరి = ఐశ్వర్యం (సంపద)<br>లేక + ఐనన్ = లేక పోయినా<br>విభూషితుండు+ఎ = అలంకరింపబడినవాడే<br>అయి = అయి<br>భాసిల్లున్ = ప్రకాశిస్తాడు. | |
| 18 | **క్రింది ప్రశ్నలలో ఏవేని రెండింటికి (2) విపులంగా సమాధానాలు వ్రాయండి. నాలుగు ముఖ్యమైన వాక్యాలు ఉంటే పూర్తి మార్కులు ఇవ్వవచ్చు.**<br>విషయ వివరణ 3 మా<br>రచనా శైలి ½ మా<br>భాషానైపుణ్యం ½ మా | 2X4=8 |
| ( i ) | త్రిజట స్వప్న వృత్తాంతాన్ని వివరించండి. | 4మా |
| జవాబు | త్రిజట విభీషణుని కుమార్తె. ఈమె లంకలో సీతాదేవికి కాపలాగా అశోకవనంలో ఉండేది. రాక్షస స్త్రీలు సీతమ్మను బెదిరిస్తూ ఉండగా త్రిజట అప్పుడే నిద్రలోంచి లేచి, ఆ రాక్షస స్త్రీలను అదలించింది.<br>తనకు ఒక కల వచ్చిందని ఆ కలను చెప్పింది. ఆ కలలో వేయి హంసలతో కూడిన పల్లకి మీద రామలక్ష్మణులు కూర్చున్నట్లు కనపడ్డారు. సముద్రం మధ్యలో తెల్లని పర్వతం మీద సీత కూర్చున్నట్టు కనిపించింది అని చెప్పింది.<br>రావణుడు నూనె పూసిన శరీరంతో నేల మీద పడి ఉన్నాడు. ఒక నల్లని స్త్రీ శరీరమంతా బురద పూసుకొని, ఎర్రని వస్త్రాలు కట్టుకుని రావణుని మెడకు తాడు కట్టి దక్షిణం వైపుగా ఈడ్చుకు వెళుతున్నది.<br>వరాహం మీద రావణుడు, మొసలిపై ఇంద్రజిత్తు, ఒంటె మీద కుంభకర్ణుడు దక్షిణ దిశగా వెళుతున్నారు. లంకా నగరం అంతా చిన్నాభిన్నం అయింది. కలలో విమానం కనిపించడం వల్ల సీత కోరిక సిద్ధిస్తుందని, రావణుడి వినాశనం తప్పదని, శ్రీరామునికి విజయం కలుగుతుందని త్రిజట రాక్షస స్త్రీలకు చెప్పింది.<br>త్రిజట రాక్షస స్త్రీలలో ఉత్తమురాలు. యుద్ధ రంగంలో పడి ఉన్న రామలక్ష్మణులు సజీవులుగా ఉన్నారని చెప్పి సీతమ్మకు ధైర్యం చెప్పింది. | |
| ( ii ) | **రామరావణుల యుద్ధాన్ని గురించి వ్రాయండి.** | 4మా |

| | | |
|---|---|---|
| జవాబు | రావణుడు ప్రయోగించిన శక్తి ఆయుధం లక్ష్మణుడి గుండెపై నాటుకుంది. లక్ష్మణుడు స్పృహ తప్పాడు. హనుమంతుడు రావణుడి వక్షస్థలం పై గుద్ది క్రింద పడేటట్లు చేశాడు. రాముడు హనుమ భుజాలపై కూర్చొని, రావణునితో యుద్ధం చేసి, రావణుని ధనుస్సును విరిచాడు. రావణుని కిరీటం నేలపై పడింది. రాముడు రావణునితో "యుద్ధంలో అలసిపోయావు. విశ్రాంతి తీసుకొని రా. నా బలం చూపిస్తా" అన్నాడు.<br>రాముడు కుంభకర్ణుని చంపాడు. లక్ష్మణుడు ఐంద్రాస్త్రంతో ఇంద్రజిత్తును చంపాడు. రావణుడు శక్తిని ప్రయోగించాడు. రాముడు దాన్ని ప్రార్థించాడు. లక్ష్మణుడు పడిపోయాడు. రాముని విలువిద్యముందు రావణుడు నిలవ లేక పరుగు తీశాడు. హనుమంతుడు ఓషధీ పర్వతాన్ని తెచ్చి, లక్ష్మణుడిని బ్రతికించాడు.<br>ఇంద్రుడు రామునకు మాతలితో దివ్యరథాన్ని పంపాడు. రాముడు ఆ రథం ఎక్కి రావణుడితో యుద్ధం చేశాడు. క్రమంగా రాముని ముందు రావణుడు నిలువలేకపోయాడు. రావణుని సారథి రథాన్ని ప్రక్కకు మళ్ళించాడు. రావణుడు సారథి పై కోపించాడు. అగస్త్య మహర్షి రామునికి, ఆదిత్య హృదయం ఉపదేశించాడు. రాముడు బాణాలు తగిలి రావణుని తలలు తెగిపడ్డాయి. కాని తిరిగి మొలుస్తున్నాయి. రామరావణ యుద్ధానికి సాటి రామ, రావణ యుద్ధమే. మాతలి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించమని రామునికి సూచించాడు. రాముని బ్రహ్మాస్త్రంతో రావణుడు మరణించాడు. | |
| ( iii ) | **హనుమంతుడు సీతాన్వేషణకు ఏ విధంగా బయలు దేరాడో వివరించండి.** | 4మా |
| జవాబు | సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను అన్ని దిశలకూ పంపాడు. అంగదుని నాయకత్వంలో హనుమ, జాంబవంతుడు మొదలయిన వీరులను దక్షిణ దిక్కుకు పంపాడు. తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్ళిన వానరులు, వట్టి చేతులతో తిరిగివచ్చారు.<br>అంగదుని నాయకత్వంలో దక్షిణ దిశకు బయలుదేరి వెళ్ళిన వానర వీరులు అణువణువూ వెదకుతున్నారు. సుగ్రీవుడు ఇచ్చిన గడువు నెల పూర్తి అయ్యింది. అంగదుడు ఉత్సాహంతో ముందుకు కదులుదాము అన్నాడు. వానరులకు ఆకలి, దప్పికలు పట్టుకున్నాయి. వారు 'ఋక్షబిలము' అనే గుహలోకి వెళ్ళారు. అక్కడ 'స్వయంప్రభ' అనే యోగిని దయతో, వానరులు ఆకలిదప్పులు తీర్చుకొన్నారు. ఆమె ప్రభావంతో, వారు సముద్రతీరానికి చేరారు. వానరులు సీత జాడ తెలిశాకే సుగ్రీవుని కలుద్దాం అనుకున్నారు. | |

| | | |
|---|---|---|
| | వానరుల మాటలో 'జటాయువు' మాట వచ్చింది. ఈ జటాయువు సోదరుడు 'సంపాతి'. సంపాతి తన దివ్యదృష్టితో లంకను గురించి వానరులకు చెప్పాడు. లంకకు వెళ్ళాలంటే సముద్రాన్ని దాటాలి. అది ఎవరివల్ల ఔతుందో అని వానరులు చర్చించుకున్నారు. హనుమంతుడు ఒక్కడే సముద్రాన్ని దాటగలడని చివరకు వారు నిశ్చయించారు.<br>జాంబవంతుడు హనుమంతుడికి అతని శక్తియుక్తులను గురించి తెలిపాడు. హనుమ బలాన్ని పుంజుకున్నాడు, దానితో హనుమ వానరులతో "నేను వేయి పర్యాయాలు మేరు పర్వతాన్ని చుట్టి రాగలను. సముద్రాలను దాటగలను" అని చెప్పాడు. హనుమ మాటలకు జాంబవంతుడు ఆనందించాడు. "నీ ధైర్యోత్సాహాలకు తగు విధంగా మాట్లాడావు. నీవు ఋషులు, గురువుల అనుగ్రహంతో సముద్రాన్ని దాటు. నీ రాక కోసం ఎదురు చూస్తూ ఉంటాం. మన వానరుల ప్రాణాలన్నీ నీపై ఆధారపడి ఉన్నాయి" అని జాంబవంతుడు హనుమకు చెప్పాడు. హనుమ, తాను ఎగరడానికి 'మహేంద్రగిరి' తగినదని, నిశ్చయించి అక్కడకు చేరాడు. | |
| (iv) | **రామ లక్ష్మణులు విశ్వామిత్రుని యాగాన్ని రక్షించిన విధాన్ని వ్రాయండి.** | 4మా |
| జవాబు | రామలక్ష్మణులు దశరథుని పుత్రులు. ధనుర్విద్య నేర్చారు. విశ్వామిత్రుడు దశరథుని వద్దకు వచ్చి, రాక్షసులు తన యజ్ఞానికి విఘ్నం కలుగజేస్తున్నారనీ, యజ్ఞ రక్షణకు రాముణ్ణి తనతో పది రోజులు పంపమని కోరాడు. రాముడికి ఇంకా పదహారు ఏళ్ళు నిండలేదనీ, యజ్ఞరక్షణకు తానే వస్తానని దశరథుడన్నాడు.<br>తన యజ్ఞానికి మారీచ సుబాహులు విఘ్నాలు కలుగజేస్తున్నారని విశ్వామిత్రుడు చెప్పాడు. రాక్షసుల మీదకి రాముణ్ణి పంపలేమన్నాడు దశరథుడు. విశ్వామిత్రునికి కోపం వచ్చింది. వశిష్ఠ మహర్షి దశరథునికి నచ్చచెప్పి, రామలక్ష్మణుల్ని విశ్వామిత్రుని వెంట పంపాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు 'బల', 'అతిబల' అనే విద్యలు ఉపదేశం చేశాడు. ఆ విద్యల మహిమవల్ల రామలక్ష్మణులకు ఆకలిదప్పులు ఉండవు.<br>మార్గమధ్యంలో తాటకి అనే రాక్షసి రాగా విశ్వామిత్రుని మాటపై రాముడు తాటక బాహువులు ఖండించాడు. లక్ష్మణుడు తాటకి ముక్కు చెవులు కోశాడు. శబ్దభేది బాణంతో రాముడు తాటకను చంపాడు.<br>విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో సిద్ధాశ్రమం చేరి, యజ్ఞదీక్ష చేపట్టాడు. మారీచ సుబాహులు యజ్ఞకుండంలో రక్తం కురిపించారు. మారీచుడిపై రాముడు 'శీతేషువు' అనే మానవాస్త్రాన్ని ప్రయోగించాడు. మారీచుడు సముద్రంలో | |

| | | |
|---|---|---|
| | పడ్డాడు. ఆగ్నేయాస్త్రంతో రాముడు సుబాహుణ్ణి చంపాడు. మిగిలిన రాక్షసులను, 'వాయువ్యాస్త్రం'తో తరిమారు. మహర్షి యజ్ఞం చక్కగా పూర్తయ్యింది. | |